ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
ఆదివారం 13 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:12




## మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన నేతాజీ యూత్ క్లబ్ మహాత్మానగర్ గ్రామంలో నేతాజీ యూత్ క్లబ్ ఆదర్శం

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి ):-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్ గ్రామంలో శనివారం రోజున మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నేతాజీ యూత్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిర్వహించడం జరిగింది. మిగతా 2 లో

# ఐఎంఏ రాజన్నా సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం

### – అధ్యక్షుడిగా డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ – ఎలక్షన్ ఆఫీసర్‌గా డాక్టర్ మనోహర్: సుసాధ్యమైన రీతిలో ఐఎంఏ జిల్లా బాధ్యుల ఎన్నిక



**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ ఎం ఏ ) 2026-2027 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వేములవాడకు చెందిన ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ (ఎం బి బి ఏస్ , ఎండీ ) ఎంపికయ్యారు. మిగతా 2 లో





# గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తితో, నిర్వహించుకుందాం.....

### - సిరిసిల్ల డిఎస్పి కే. నాగేంద్ర చారి

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సిరిసిల్ల డిఎస్పి కే నాగేంద్ర చారి సూచించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని సాయి శివ గార్డెన్ నందు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల తో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాల నిర్వాహకులు గణేష్ పోర్టల్2026లో తమ మండపానికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని,ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిగతా 2 లో



# ఐఎంఏ రాజన్నా సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం

మొదటిపేజీ తరువాయి







ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్ల సరయు హాస్పిటల్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ తాడుక సాయికుమార్ (ఎం బి బి ఏ స్ , ఎండీ పెడియాట్రిక్స్ ), కోశాధికారిగా శ్రీ మహాలక్ష్మి హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఎ. జైల్ సింగ్ (ఎం బి బి ఎస్ , ఎండీ జనరల్ మెడిసిన్ ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ పి. యాదగిరి, డాక్టర్ జి. అభినయ్, సహ కార్యదర్శులుగా డాక్టర్ వెంకట్, డాక్టర్ మోహనకృష్ణ, డాక్టర్ చందన బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎన్నికల ప్రక్రియ అంతటినీ వేములవాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మనోహర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి, పారదర్శకంగా పూర్తి చేశారు.రాజన్నా సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని నూతన అధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని వైద్యుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ఐఎంఏ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ప్రభుత్వ వైద్య రంగానికి పూర్తి సహకారం అందిస్తూ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తితో, నిర్వహించుకుందాం.....

మొదటిపేజీ తరువాయి




ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మండపాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి , టీజీ–కాప్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు.జియోట్యాగింగ్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుంటుందన్నారు. గణేష్ విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో పోలీస్ శాఖ రూపొందించిన రూట్ మ్యాప్‌ను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు.గణేష్ ఉత్సవాల్లో మండపాలు, శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని,అనుమతి లేకుండా డీజేలు వినియోగిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రాత్రి 10 గంటల వరకు రెండు చిన్న స్పీకర్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.. అలాగే సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, వాస్తవాలు నిర్ధారించుకోకుండా వాటిని ఫార్వర్డ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉండి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తమని హెచ్చరించారు..విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని,విద్యుత్ షార్ట్ సర్క్యూట్,అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. అవసరమైన ప్రదేశాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫైర్ బాల్స్,నీటి బకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలను సంతోషకర వాతావరణంలో నిర్వహించుకునేలా పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నమని,ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే దయల్–112కు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈసమావేశంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్, ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్.రమేష్ మరియు మండపాల నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన నేతాజీ యూత్ క్లబ్ మహాత్మానగర్ గ్రామంలో నేతాజీ యూత్ క్లబ్ ఆదర్శం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజిద్దాం ప్రకృతిని కాపాడుదాం అనే నినాదంతో వెళ్లాలని కోరారు.ఇట్టి కార్యక్రమానికి భక్తులు అలాగే గ్రామ ప్రజలు, నేతాజీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలు, లోఓల్టేజీతో రైతుల అవస్థలు

## - సకాలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న వేళ విద్యుత్ సమస్య మరింత ఇబ్బంది

**ముస్తాబాద్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్న సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బదనకల్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో శనివారం ఉదయం నిర్వహించిన గుడ్ మార్నింగ్ బదనకల్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ చిగురు నరేష్, వార్డు సభ్యుడు వెంకట్‌రెడ్డి రైతులతో కలిసి విద్యుత్, యూరియా సమస్యలపై చర్చించారు.రైతులకు వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా కావడం లేదని, మూడు దశల విద్యుత్ ఇస్తామని చెప్పినప్పటికీ తరచూ రెండు, మూడు గంటల పాటు కోతలు విధిస్తున్నారని రైతులు తెలిపారు. దీనికితోడు లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోతున్నాయని, ఒక్కో రైతు నెలలో రెండు సార్లు వరకు మోటార్లను మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాలు లేక ఇప్పటికే పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని, కనీసం బోర్ల ద్వారా పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ సక్రమంగా ఉంటే కొంతైనా ఉపశమనం కలుగుతుందని రైతులు పేర్కొన్నారు. అయితే విద్యుత్ కోతలు, లోఓల్టేజీ కారణంగా పంటలకు నీరు అందించలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.ఇళ్లకు కూడా విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్య తలెత్తడంతో డీటీఆర్‌లు కాలిపోతున్నాయని, దీంతో గ్రామ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ సమస్యతో పాటు యూరియా కొరత కూడా ప్రస్తుతం రైతులకు తీవ్ర సమస్యగా మారిందని రైతులు చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పరిష్కార మార్గాలపై చర్చించేందుకు ఈ చర్చా



వేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకట్‌రెడ్డితో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అశోక్ నగర్‌లో తీరిన తాగునీటి కష్టాలు

## - 54వ డివిజన్‌లో నూతన బోరు ప్రారంభించిన మేయర్

**కరీంనగర్ టౌన్,సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి)**

నగరంలోని 54వ డివిజన్ అశోక్ నగర్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీవాసుల తాగునీటి కష్టాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన నూతన బోరును శనివారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.కాలనీలో నీటి ఎద్దడిని గుర్తించిన 54వ డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన బోరు ఏర్పాటు చేయించారు. నీటి సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు విద్యుత్ కనెక్షన్ కోసం కరెంటు మీటర్‌ను కూడా ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, ముఖ్యంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అన్నారు. నగరంలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.నూతన బోరు ఏర్పాటుతో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. బోరు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ ఉమారాణి వెంకటరమణకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, రమేష్, అరుణ్, శ్రీనివాస్, గండి గణేష్ తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



# మిడ్ మానేరు నుండి సాగునీరు విడుదల చేయాలి సిద్ధం వేణు

**ఇల్లంతకుంటసెప్టెంబర్12(ప్రజా జ్యోతి)**



సాగునీటి కోసం రైతులు నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు ఆరోపించారు. శనివారం రోజు ఇల్లంతకుంట మండలం పొత్తూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో సిద్ధం వేణు మాట్లాడుతూ.. కందికట్కూరు, వంతడుపుల, వల్లంపట్ల, కృష్ణారావుపల్లె, రంగంపేట, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పొత్తూరు తదితర గ్రామాల రైతులు సాగునీటి కోసం రోజూ ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు సాగునీరు అందక ఎండిపోతుండటంతో రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యమానేరు ప్రాజెక్టులో నీటి నిల్వ ఉన్నప్పటికీ అనంతగిరి రిజర్వాయర్‌కు నీటిని ఎందుకు పంపింగ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఎల్నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొడుతోందని అన్నారు.ఒకవైపు సాగునీరు అందక పంటలు ఎండిపోతుండగా, మరోవైపు వ్యవసాయానికి కనీసం ఎనిమిది గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. సాగునీరు, విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా కొరత, కరెంటు కోతలు, సాగునీటి సమస్యలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు.మధ్యమానేరు ప్రాజెక్టు నుంచి సోమవారంలోగా కుడికాల్వకు నీటిని విడుదల చేయకుంటే మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సారథ్యంలో మంగళవారం వేలాది మంది రైతులతో కలిసి చలో మధ్యమానేరు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసేందుకు రైతులతో కలిసి ముందుకు సాగుతామని అన్నారు. కుడికాల్వకు నీరు అందక సుమారు 8 వేల ఎకరాల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, రైతులు సాగునీటి కోసం రోజుకో గ్రామంలో ధర్నాలు చేస్తున్నా ఎమ్మెల్యేకు ఎందుకు కనికరం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే మధ్యమానేరు కుడికాల్వకు, ఎంఎంఆర్ కిందిభాగానికి నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. రైతుల ఉసురు పోసుకుంటే ప్రభుత్వ పతనం ఖాయమని,రైతులను విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండుటెండల్లోనూ చెరువులు మత్తడులు దుంకేలా సాగునీరు అందించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, రైతుభీమా ప్రీమియం చెల్లింపులపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్, ఉపసర్పంచ్ బండారి నరేష్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కదురు శేఖర్, నాయకులు ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, రొండ్ల కరుణాకర్ రెడ్డి, పట్నం మహేందర్, గుంటి మధు, ఆకుల మహేందర్, ఆకుల అనిల్ కుమార్, తోడేటి సతీష్, దయ్యాల చంద్రమౌళి, గుంటి మల్లేశం, ఒట్టే మల్లేశం, బండారి మహేష్, గుంటి నాగరాజు, కోల నాగరాజు, ఒట్టే శ్రీనివాస్, ఒట్టే అనిల్, కొలుపుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు

## - మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, వేములవాడ పట్టణ ప్రజలకు మున్సిపల్ పాలకవర్గం తరఫున, గౌరవ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారి తరఫున వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఆయన కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులకే ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఈ సంవత్సరం తొలిసారిగా మున్సిపల్ కార్యాలయంలో మట్టి



వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించనున్నట్లు చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు తూమ్ మధు, కొండ రాజశేఖర్, తోట రాజు, కొక్కుల బాలకృష్ణ, మైలారం శ్రీనివాస్, ఎలా శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, ఫీర్ మహమ్మద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రానున్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. నిమజ్జన సమయంలో వినాయక విగ్రహాలు చెరువులో పూర్తిగా నిమజ్జనం అయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చెరువులో గత కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను క్రేన్ సహాయంతో తొలగించే పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పరిశీలించారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెరువును శుభ్రం చేసి, భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని చైర్మన్ తెలిపారు.



# వేములవాడ రాజన్నసన్నిధి లోసెప్టెంబర్ 14 నుంచి వినా యక నవరాత్రులు

## - ఏర్పాట్లనుపరిశీలించినఆలయ ఈవో

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈ ఏడాది రాజన్న ప్రధాన ఆలయంలో వినాయక నవరాత్రులను ఏకాంతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో పవిత్ర పూజా క్రతువులు జరగనున్నాయి. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలు సాగనున్నాయి. భక్తుల దర్శనార్థం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి మండపంలో ప్రత్యేక గణపతి మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాలతో మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. శ్రీ భీమేశ్వర ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి రమాదేవి స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భక్తులకు



ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో దేవస్థాన డీ.ఈ రామ్ కిషన్ రావు , సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ లో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు లబ్ధిదారులు జిల్లాల ఉమా 27,500 పల్లెపాటి రవీందర్ 21000 500 బొంబోతుల కమలా 24,000 చాట్ల నవ్య 20,000 చెక్కులను పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నమిల కొండ సత్యనారాయణ తెలిపారు ఈ కార్యక్రమంలో దేవేందర్ దండు శ్రీనివాస్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో మేకప్ రంగంలో ప్రత్యేక శిక్షణ

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**



తెలంగాణ బ్యూటీ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ వేములవాడ ఆధ్వర్యంలో మేకప్ రంగంపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం ఆర్గనైజర్ రూప ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఇంటర్నేషనల్ మేకప్ ఆర్టిస్ట్ ఆకుల సోనిక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేకప్ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, నూతన టెక్నిక్స్, ప్రొఫెషనల్ మేకప్‌లో పాటించాల్సిన మెళకువలపై పాల్గొన్న వారికి శిక్షణ ఇచ్చారు. బ్యూటీ ప్రొఫెషనల్స్ నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకుని తమ కెరీర్‌లో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వేములవాడతో పాటు ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి బ్యూటీ ప్రొఫెషనల్స్ హాజరై నూతన టెక్నిక్స్‌పై అవగాహన పొందారు. కార్యక్రమంలో రాధిక, కవిత, మంజుల, సంధ్య, రవళి తదితరులు పాల్గొన్నారు.



# సొంత ఇల్లు లేని పేదోడికి అండగా ముక్తి ఆశ్రమం..

## - కడసారి చూపు నుంచి కర్మకాండ వరకు పుట్ట లింగమ్మ చారిటేబుల్ ట్రస్ట్ నిర్మించిన ముక్తి ఆశ్రమ్‌లోనే..

## - బాధిత కుటుంబానికి ముత్తారం గ్రామం సర్పంచ్ పరామర్శ..

**ముత్తారం,సెప్టెంబర్,12 (ప్రజా జ్యోతి)**

అద్దె ఇంట్లో ఉంటూ ఆఖరి మజిలీకి అష్టకష్టాలు పడే పేదోడికి ముక్తి ఆశ్రమం భరోసా ఇస్తోంది.అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబంలో ఎవరైనా చనిపోతే అంతిమ కార్యక్రమం ఆ అద్దె ఇంట్లో నిర్వహించేందుకు ఇంటి యజమానులు అడ్డుకుంటుంటం సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. ఒకరు చనిపోతే గౌరవించాల్సిన పరిస్థితులు ఉన్నా కట్టుబాట్లు, ఆచారాల పేరుతో పేదోడిని ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు ఉన్నాయి.మంథని నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు పేదకుటుంబ సభ్యులు చనిపోతే అద్దె ఇంట్లో ఉంచలేక చివరకు పార్థివ దేహాన్ని రోడ్డుపైనే ఉంచిన సందర్భాలు అనేక ఉన్నాయి. పేదోడి ఆఖరి మజిలీకి కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పుట్ట లింగమ్మ చారిటబుల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని బస్ డిపో సమీపంలో ముక్తి ఆశ్రమం నిర్మించారు. అద్దె ఇంట్లో ఉంటూ ఎవరైన చనిపోతే వారి అంతిమ సంస్కారాలతో పాటు కర్మకాండ పూర్తి చేసుకునే వరకు ఈ ముక్తి ఆశ్రమంలో ఉండి చేసుకునే విధంగా సదుపాయాలు కల్పించారు.ఈ మేరకు ముత్తారం మండల కేంద్రానికి చెందిన పట్టణానికి బొల్లం మల్లయ్య గోదావరిఖనిలో ఓ ఇంట్లో కిరాయి ఉంటున్నారు.ఈ క్రమంలో మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అంగీకరించలేదు.దీంతో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ముక్తి ఆశ్రమంలో వారి అంతిమ కార్యక్రమం చేసుకుంటున్నారు. శనివారం మల్లయ్య కుటుంబసభ్యులను మాజీ వైస్ ఎంపీపీ, ముత్తారం గ్రామ సర్పంచ్ సుధాటి రవీందర్ రావు పరామర్శించారు. ముక్తి ఆశ్రమం మీలాంటి పేదోళ్ల కోసమే ఏర్పాటు చేశామని,పేదోడి మజిలీలో ఎలాంటి ఇబ్బందులు రాకూడనే ఆలోచనతో ముక్తీ ఆశ్రమ పుట్ట మదన్న నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు రవీందర్ రావు తెలిపారు.అనంతరం బొల్లం మల్లయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మాలాంటి పేద కుటుంబాలకు ముక్తీ ఆశ్రమ ఏర్పాటుచేసిన పుట్ట మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం ముత్తారం మండల బీసీసీల్ అధ్యక్షులు చల్ల సమ్మయ్య,ముత్తారం గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రాగుల రవీందర్,సీనియర్ నాయకులు రాగుల రాజేశం పలువు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ.. గాదె గుణసాగర్

**వీణవంక, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**



వినాయక చవితి సందర్భంగా పీవోపీ విగ్రహాలకు, రసాయన రంగులకు దూరంగా ఉండి మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ కోరారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు.పీవోపీ విగ్రహాలు, రసాయన రంగుల వల్ల నీటి వనరులు కలుషితమై జలచరాలకు, పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా ప్రకృతికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.వినాయక మండపాల నిర్వాహకులు, యువత, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ప్లాస్టిక్, థర్మాకోల్, ఇతర వ్యర్థాలను నీటిలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు."మట్టితో వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని గాదె గుణసాగర్ పిలుపునిచ్చారు.



# పేదల సొంతింటి కల సాకారం చేస్తుండటమే ప్రభుత్వ లక్ష్యం ముస్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు

- వేములవాడ 15వ వార్డు హన్మక్కపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్.
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు
- పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం: వేములవాడ మున్సిపల్ చైర్మన్



**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

నిరుపేదల సొంతింటి కళను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేద కుటుంబాలకు ఆర్థిక కొరత లేకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికీ విడతల వారీగా నేరుగా ఖాతాల్లోకి నిధులు జమచేస్తూ, వారు ఆత్మగౌరవంతో సొంత ఇంట్లో నివసించేలా పాలకులు ప్రజా సంక్షేమ బాటలో పయనిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని 15వ వార్డు హన్మక్కపల్లి లో సింగారపు మమత అనే లబ్ధిదారురాలికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో పట్టణంలో తొలి విడత కింద మంజూరైన గృహాల్లో అత్యధిక శాతం ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకొని లబ్ధిదారులు సంతోషంగా గృహప్రవేశాలు కూడా చేసుకోవడం ఎంతో గర్వకారణమని ఆయన కొనియాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పనులు అనుకున్న సమయానికి వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నూతనంగా ఇళ్లు మంజూరైన



లబ్ధిదారులు కూడా ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఇంటి నిర్మాణాల్లో లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని చైర్మన్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ లోకేష్, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, చేకుర్తి రమేష్,గెంట్యాల ప్రకాష్,వార్డ్ ఆఫీసర్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

## - వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

**కోనరావుపేట,సెప్టెంబర్.12(ప్రజాజ్యోతి)**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం కోనరావుపేట పోలీస్ స్టేషన్ లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ విగ్రహ ప్రతిష్టాపన నుంచి పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు, నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ, పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను సజావుగా నిర్వహించేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై రామ్మోహన్, విద్యుత్ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# మూడు ముక్కల పేకాట.. 14 మంది అరెస్ట్

## రూ.22 వేల నగదు, 52 పేకముక్కలు స్వాధీనం

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**

గోపాల్‌పూర్ గ్రామ శివారులో డబ్బులు పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్న 14 మందిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అందిన సమాచారంతో పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,000 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యల కోసం కోర్టులో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. కరీంనగర్ రూరల్ పరిధిలో డబ్బులు పెట్టి జూదం, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏబీవీపీ విద్యార్థుల ముందస్తు అరెస్టు తెల్లవారుజామున 5 గంటలకు ఏబీవీపీ కార్యాలయంలో పోలీసులు అక్రమంగా చొరబడి విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తూ ఉంది నేడు రాష్ట్రంలో నెలకొన్నటువంటి విద్యారంగ సమస్యలపై రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న 11వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలని ఈరోజు ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే విద్యార్థి నాయకులను అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అక్రమ అరెస్టులు చేయడం జరిగిందన్నారు దీన్ని ఏబీవీపీ తీవ్రంగా ఏబీవీపీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ లో పెల్లి రాజు రావు ఖండించారు.




# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల గొల్లపల్లి వద్ద ఎల్లారెడ్డిపేట లైన్స్ క్లబ్ వారు సౌజన్యంతో గొల్లపల్లి బస్టాండులో శనివారం రోజు 400 మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులందరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టి చేసి పూజలు చేసుకోవాలని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని లైట్స్ క్లబ్ వారు కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు బోయిన మహదేవ్ ట్రెజరర్ శ్రీకాంత్ రెడ్డి డిస్టిక్ మెంబర్ ముత్యాల శ్రీనివాస్ రెడ్డి నంది కిషన్ సభ్యులు సద్ది లక్ష్మారెడ్డి ముత్యం రెడ్డి లింగారెడ్డి సాంబశివరావు గొల్లపల్లి లక్ష్మారెడ్డి పందాల లక్ష్మారెడ్డి రవీందర్ కొలనూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**సుల్తానాబాద్: సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంకణాల చిన్న కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా చొప్పరి అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చీకట్ల నాగరాజు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కొలిపాక రమేష్, చీకట్ల సారయ్య, చొప్పరి శ్రీనివాస్, ఉస్తేం శంకరయ్య, కంకణాల ప్రభాకర్, బొజ్జ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడతామని పేర్కొన్నారు. అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సంఘ అధ్యక్షుడు గుర్రాల మల్లేశం కౌన్సిలర్ సిద్ధ తిరుపతి, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, , సంఘ వైస్‌ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, ఉస్తేం రవి, మాజీ ఎంపీటీసీ కంకణాల ఆశాలు, చొప్పరి సుమన్, చీకట్ల రాజయ్య, ఉస్తేం శ్రీనివాస్, కంకణాల తిరుపతి, సంఘ సభ్యులు, మత్స్యకారులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.






# ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఇన్ పేషంట్లకు బ్రెడ్ పండ్ల పంపిణీ

- పండ్లు బ్రెడ్డు పంపిణీ కార్యక్రమంలో

- పాల్గొన్న డాక్టర్ సుందరి

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

హైదరాబాద్ వాస్తవ్యులు గంగిరెడ్డి మల్యాద్రి జ్ఞాపకార్థం వీరి మిత్రులు వరంగల్ వాస్తవ్యులు పోమార్ (డైమండ్) శ్రీనివాస్ అందించిన సహకారంతో నేడు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఉన్న పేషంట్లకు పండ్లు బ్రెడ్ అందజేయడం జరిగిందని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ తో పాటు మహమ్మద్ రఫిక్ పసుల శ్రీధర్ చల్లా సత్తయ్య గొండ ప్రసాద్ మధు ప్రత్యూష అబు సోఫియాన్ తదితరులు. పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతే మేలు

**పెద్దపల్లి ప్రతినిధి 12 సెప్టెంబర్ ప్రజా జ్యోతి:**

వినాయక చవితిని పురస్కరించుకుని గాయత్రి విద్యానికేతన్‌లో విద్యార్థులకు రెండు రోజులపాటు మట్టి గణపతి విగ్రహాల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూనారం గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఆసక్తిగా మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేశారు.చెరువు మట్టితో గణపతి తయారీపై అవగాహన వర్షాకాలంలో చెరువుల్లోని మట్టిని తీసుకుని గణపతి విగ్రహాలను తయారు చేసి, వివిధ పత్రాలతో పూజించిన అనంతరం అదే చెరువులో నిమజ్జనం చేయడం ద్వారా చెరువు పూడిక తొలగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని విద్యార్థులకు వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతులను పూజించాలని అవగాహన కల్పించారు.తల్లిదండ్రులకు 100 మట్టి గణపతుల పంపిణీకార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు సుమారు 100 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసుకున్న విగ్రహాలను ఆనందంగా ఇళ్లకు తీసుకెళ్లారు.కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# ఆటలతో ఆరోగ్యం.. మానసిక దృఢత్వం

**పెద్దపల్లి ప్రతినిధి 12 సెప్టెంబర్ ప్రజా జ్యోతి:**

పెద్దపల్లి జిల్లా కో–కో అసోసియేషన్ ఆధ్వర్యంలో అప్పన్నపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఖేలో ఇండియా సెలక్షన్ ట్రయల్స్, సీనియర్స్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. జిల్లా కో–కో అసోసియేషన్ అధ్యక్షుడు టి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖేలో ఇండియా, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కే. లక్ష్మణ్, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలు ఆడటం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా తయారవుతారని అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు.వివిధ ప్రాంతాల నుంచి సుమారు 230 మంది విద్యార్థులు సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొన్నారు.కార్యక్రమంలో కో–కో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దాసరి ప్రసాద్, డాక్టర్ భూపెల్లి నారాయణ, కోశాధికారి ఇస్లావత్ నరేష్, కన్నూరి కోటేష్, జ్ఞాన విద్య ఉపాధ్యాయులు షఫీ, మధుకర్, తిరుపతి, భాస్కర్, కిషోర్, అంజలి, శిరీష, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.



# ఎల్లారెడ్డిపేట మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షుడిగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ. - జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమానికి కృషి.**

**ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి) :**

ఎల్లారెడ్డిపేట మండలం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల స్థాయిలో జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, పాత్రికేయుల వృత్తిపరమైన అభివృద్ధి, హక్కులు, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలనే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా మోస్ట్ సీనియర్ జర్నలిస్టులు బండారి బాలరెడ్డి, కాసు శ్రీనివాసరాజు లు,అధ్యక్షుడిగా బుగ్గ కృష్ణమూర్తి శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల ఉపాధ్యక్షులుగా కులేరి కిషోర్ కుమార్, దుర్గం విజయ్ బాబు, పెంటం శ్రీనివాస్ లు,ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు బాలరాజు యాదవ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా కులేరి దీప్తి కుమార్, ఒగ్గు మహేష్ చంద్ర, కోశాధికారిగా శ్రీ రామోజీ శేఖర్ నియమితులు అయ్యారు.సలహాదారులుగా చే ట్కూరి తిరుపతి, శ్రీ రామోజీ ప్రవీణ్, సురేష్ యాదవ్ లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సురేష్, చేపూరి నాగరాజు, చింతకింది శ్రీనివాస్ ఎన్నికయ్యారు.అలాగే సంయుక్త కార్యదర్శులుగా యమగొండపద్మా రెడ్డి, ముద్రకోలా కృష్ణ, బెస్త నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి.**

నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు పాత్ర పోషిస్తామని అన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక అంశాలు, ప్రజా సమస్యలకు సంబంధించిన వార్తలను వాస్తవాలను ఆధారంగా



చేసుకుని ప్రజలకు చేరవేయడమే తమ ప్రధాన లక్ష్యమని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ప్రజలకుప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.

**నూతన కార్యవర్గానికి ఘన సన్మానం.**

ఎల్లారెడ్డిపేట మండలానికి పూర్తిస్థాయి ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పడటంతో పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, కంచర్ల మాజీ సర్పంచ్ జొన్నల శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ నాయకుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు.అదేవిధంగా ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశానికి హాజరైన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్, ఎస్ఐ ఎన్. రమేష్ గౌడ్ నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చురుకైన పాత్ర పోషించాలని పలువురు ఆకాంక్షించారు.

# యువత రక్తదానం చేయాలి

**చొప్పదండి, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

కరీంనగర్ లోని ఆసుపత్రి లో అత్యవసర సమయంలో పేషంట్ కు రక్తం అవసరం కాగా, చొప్పదండి మండలం భూపాలపట్నం కు చెందిన గొల్లపెల్లి నరేష్ తన బి నెగటివ్ రక్తాన్ని 43వ సారి రక్త దానం చేశారు. నరేష్ మాట్లాడుతూ రక్తం ఎక్కడ కూడా కృత్రిమంగా తయారు చేయలేమని, అత్యవసర సమయంలో రక్త దానం చేయడం వల్ల విలువైన ప్రాణాలు కాపాడ గలుగుతామని అన్నారు.అలాగే యువకులు మూడు నెలలకి , పెళ్లి రోజులు, పుట్టిన రోజుల సందర్భంగా కూడా స్వచ్ఛందంగా ముందుకి వచ్చి రక్త దానం చేసి విలువైన ప్రాణాలని కాపాడాలని కోరారు.



# బాధిత కుటుంబానికి కరీంనగర్ మేయర్ పరామర్శ

**చొప్పదండి, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి):**

చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన రామోజు పూర్ణ చెందర్ మాతృమూర్తి ఇటీవలే అనారోగ్యంతో మరణించగా కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మొగిలి సారయ్య, చేపూరి సత్యనారాయణ ,దొంతిసారపు సంపత్, కట్నపల్లి ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తోట కోటేష్, మాజీ మండల అధ్యక్షులు కిట్టు గౌడ్, మండల నాయకులు గన్ను నర్సింహా రెడ్డి, ఏడ్ల సురేష్, పెద్ది వీరేశం, తాటికొండ కుమార్, గాండ్ల సతీష్, పోలె మహేష్ ,తొంటి సతీష్, సాయిల్ల రవి, తొంటి అశోక్, గాండ్ల వేణు, పాలకూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



# ఉల్లాసంగా ఉత్సాహంగా పారమిత ఉపాధ్యాయుల సమ్మేళనం

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**

కరీంనగర్ పట్టణంలోని రేకుర్తి శుభం కన్వెన్షన్ లో ఏకత్వ అనే పేరుతో పారమిత ఉపాధ్యాయు ల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారమిత ఉపాధ్యాయులు నృత్యాలు, నాటకాలు, పాటలతో వివిధ సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పారమిత పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుల మధ్య ఆహ్లాదకరమైన, స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల అధినేత డా: ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇలాగే ప్రతి రోజు ఉపాద్యాయులు ఆనందంగా ఉత్సాహంగా ఉంటూ సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మంత్ర ముగ్ధ లను చేశాయి. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాద్యాయులకు ఇచ్చిన గౌరవానికి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారమిత విధ్యాసంస్థల అధినేత డా: ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, రశ్మిత,అనుకర్ రావు, వినోద్ రావు, రాకేశ్, ప్రాచి, వి.యు.యం.ప్రసాద్, హనుమంత రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీకర్, ప్రశాంత్, బాలాజీ, గోపికృష్ణ, కవిత, శర్మిష్ఠ, సమన్వయకర్తలు మరియు ఉపాద్యాయులు పాల్గొన్నారు.




# కారులో 8.19 కిలోల గంజాయి.. ఒకరి అరెస్ట్

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ నగరంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు నిర్వహిస్తున్న నిఘాలో భారీగా గంజాయి పట్టుబడింది. కరీంనగర్-1 టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీల్లో 8.19 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. లక్ష్మీనగర్‌లోని అమీర్ షాహీ మసీదు సమీపంలో గంజాయిని నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కదలికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 11న అమీర్ షాహీ మసీదు సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన మొహమ్మద్ రిజ్వానుద్దీన్ అలియాస్ ఫైజాన్ (26)ను అదుపులోకి తీసుకున్నారు. అతని ఆధీనంలోని కారును తనిఖీ చేయగా డిక్కీలో బ్యాగుల్లో ప్యాక్ చేసి ఉంచిన గంజాయి బయటపడింది. మొత్తం 8.190 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలింపునకు ఉపయోగించిన కారుతో పాటు ప్యాకింగ్ సామగ్రి, మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**ఈ ఘటనపై కరీంనగర్-1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో**




కేసు నమోదు చేసి, ఎన్‌డీపీఎస్ చట్టం కింద దర్యాప్తు చేపట్టారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలిస్తున్నారు? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు సమాచారం లభించడంతో వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గంజాయి కొనుగోలు, రవాణా, సరఫరా మార్గాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసును ఛేదించడంలో కరీంనగర్-1 టౌన్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు తెలిపారు.

# చికిత్స కోసం 2 లక్షల యాబై వేల ఎల్ ఓ సి అందజేత



- అనారోగ్యంతో బాధపడుతున్న శీలం అజయ్ కి

మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి

సహాయ నిధి ద్వారా చేయూత..

**ముత్తారం సెప్టెంబర్,12 (ప్రజా జ్యోతి)**

మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన శీలం అజయ్ కి రూ 2,50,000/-ఎల్ వో సి మంజూరు చేశారు. అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించి నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సిఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి ఎల్ఓసి మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది. చికిత్స కోసం ఎల్ వో సి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు..

# మట్టి గణేష్‌ను ప్రతిష్ఠిద్దాం ప్రకృతిని పరిరక్షిద్దాం

విగ్రహాలను పంపిణీ చేసిన

కార్పొరేటర్ మల్లేశం

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):-**

కరీంనగర్ జిల్లా 8వ డివిజన్ కార్పొరేటర్ కల్వ మల్లేశం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని రసాయనాలతో తయారు చేసిన గణేష్ విగ్రహాలను ఉపయోగించవద్దని రసాయన రంగులు నీటిని కలుషితం చేసి పర్యావరణానికి హాని చేస్తాయని తెలిపారు. ప్రతి ఇంట్లో మట్టి గణేష్‌ను ప్రతిష్ఠిద్దాం. మన పండుగను భక్తితో జరుపుకుంటూనే, మన ప్రకృతిని కూడా కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ సిగిరెడ్డి స్వామి రెడ్డి,రైతు సమితి అధ్యక్షులు కంది రామచంద్రారెడ్డి,బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు సల్ల మహేందర్,యూత్ అధ్యక్షులు దీపక్,సీనియర్ నాయకులు బుల్లాడి నరసింహారెడ్డి, తమ్మనవేని అంజి, ఎంపిటిసి అంజి,దాసం కమలాకర్,పరుశురాం, తొర్తి ప్రశాంత్,లంక రవి, వేణు, నిఖిల్,ఎర్రశీ అనంతరెడ్డి,సంపత్ పరకుశం,చందు,ప్రకాష్ మహేందర్,కుమార్ తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అంకిత్ హాస్పిటల్స్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు

## అంకిత్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ అనురాధ

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి):-**

పేదలు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలనే సేవాభావంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న అంకిత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. కవ్వంపల్లి అనురాధ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మానకొండూరు మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న మహిళలకు శనివారం రిపోర్టులను అందజేసి, వైద్యపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా. అనురాధ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల పేరుతో రోగులను తమ ఆసుపత్రికి రప్పించుకోవాలనే ఉద్దేశం తమకు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి, అవసరమైన సమయంలో సరైన చికిత్స పొందేలా అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు.అయితే,ఉచిత వైద్య శిబిరాలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. శిబిరాల ద్వారా వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స, వైద్య సేవలు అందేలా మార్గనిర్దేశం చేయాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆసుపత్రి సేవలను రాజకీయాలకు వేదికగా మార్చి లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు.సుమారు పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తికి ఎల్‌వోసీ అంటే ఏమిటో, దాని ద్వారా ఏ ఆసుపత్రిలో చికిత్స, వైద్య సేవలు పొందవచ్చో తెలియకపోవడం శోచనీయమని డా. అనురాధ వ్యాఖ్యానించారు.గత నెల 23న ఎం ఎన్ జే , అంకిత్ హాస్పిటల్స్



సయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పరీక్షల్లో కొంతమందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, అర్హులైన వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా. అనురాధ సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి,ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,నాగిశెట్టి రాజయ్య,గంగుల రామిరెడ్డి,రొంటాల లక్ష్మారెడ్డి,పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తిరుమల రెడ్డి,బుర్ర శ్రీధర్ గౌడ్,మడుపు ప్రేమ్ కుమార్, కోంండ్ర సురేష్,రేవెల్లి రాజలింగం,కనకం అశోక్,గొల్లెన కొమురయ్య, ఎన్ బాపురావు, బాకారపు సమ్మయ్య, ఎడ్ల శ్రీధర్, బుర్ర బుర్ర శ్రీకాంతు దూలం దేవేంద్ర, దూలం వీరస్వామి,ఎర్రోళ్ల కవిత,రాజేశం తదితరులు పాల్గొన్నారు .

# మోగిన ఒగ్గు డోళ్లు - మార్మోగిన కొలనూరు పల్లె

## - గణపతికి ఘన స్వాగతం

**కోనరావుపేట,సెప్టెంబర్.12 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ యువత ఉత్సాహంతో గణనాథుడికి ఘనంగా స్వాగతం పలికారు.గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ యాదవ యూత్ సంఘం ఆధ్వర్యంలో నూతన వినాయక విగ్రహాన్ని తీసుకువచ్చారు. సంప్రదాయ ఒగ్గు కళాకారుల డోలు చప్పుళ్లు, తాళాల వాయిద్యాల నడుమ, యువకుల కేరింతలు, నృత్యాలతో గ్రామ పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహించారు.ఒగ్గు కళాకారుల విన్యాసాలు, యువకుల సందడితో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. భక్తుల జయజయధ్వానాల మధ్య గణపతి విగ్రహాన్ని మండపంలోకి తీసుకువచ్చరూ.అనంతరం విగ్రహానికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు నిర్వహిస్తారు. 9 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ వివిధ పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ యూత్ సంఘం అధ్యక్షులు, సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వేములవాడలో ఘనంగా వినాయకుల రాక

## - అడుగడుగునా గణనాథుల సందడి.. అట్టహాసంగా ప్రతిష్ఠాపనలు

## - కులమతాలకతీతంగా ఒక్కటవుతున్న పట్టణ ప్రజలు

**వేములవాడ,సెప్టెంబర్,12:ప్రజాజ్యోతి.**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ పట్టణం గణనాథుల రాకతో సందడిగా మారుతోంది. పట్టణంలోని ప్రతి వార్డులో వివిధ సంఘాలు, యువజన సంఘాలు, యూత్ నాయకులు పోటీపడి గణపతి విగ్రహాలను తరలించి ప్రతిష్ఠిస్తున్నారు. హైదరాబాద్, కోరుట్ల తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గణనాథుల విగ్రహాలను తీసుకొచ్చి అట్టహాసంగా స్వాగతం పలుకుతున్నారు.ప్రతి ఏడాది ఆనవాయితీగా కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను ఈసారి కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు గణపతి విగ్రహాల తరలింపు, ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



### 50 ఏళ్లుగా వైభవంగా ఉత్సవాలు

వేములవాడ పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు గత 50 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆడ, మగ, చిన్న, పెద్ద అనే తేడా లేకుండా, కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఉత్సవాల్లో భాగస్వాములవుతూ భక్తిశ్రద్ధలతో గణనాథుడిని కొలుస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించడం వేములవాడ ప్రజల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

### భగవంతు రావు నగర్‌లో ఘనంగా గణపతిఆహ్వానం

భగవంతు రావు నగర్‌లో వి .వై.ఎస్.బి.జి.ఆర్. యూత్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి స్వాగతం పలికారు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మామిళ్ల అమర్‌షా, బీజేపీ నాయకులు లక్ష్మీరాజ్యం, యూత్ నాయకులు, వార్డు పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గణనాథుడి నామస్మరణతో వార్డు మొత్తం మార్మోగగా, భక్తులు ఉత్సాహంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రానున్న నవరాత్రి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి ఫోటో పెట్టాలి

## - బిజెపి పార్టీ. ఎస్సీ సెల్ మాజీ మండల కన్వీనర్ పురుషోత్తం అనిల్.

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి ఫోటో పెట్టాలని బిజెపి పార్టీ ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు పురుషోత్తం అనిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోజున ప్రజా జ్యోతి విలేకరితో ఆయన మాట్లాడుతూ. పేదల కడుపు నింపుటకు కేంద్ర ప్రభుత్వం .గత కొన్ని సంవత్సరాల నుండి ఉచితంగా బియ్యం ఇస్తుందని అది రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని ఆయన అన్నారు. పార్టీలకు అతీథంగా ప్రధానమంత్రి ఫోటో పెట్టవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాని దే అన్నారు. సొమ్ము బీజేపీ పార్టీది అయితే. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సరికాదు అన్నారు.



# ప్రభుత్వ బడి పిల్లలకు అండగా వట్టిమల్ల యువత

## – 100 మంది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**కోనరావుపేట,సెప్టెంబర్.12 (ప్రజా జ్యోతి)**

కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకులు సేవా స్ఫూర్తిని చాటుకున్నారు.గ్రామానికి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి లక్కం కృష్ణ ఆలోచనతో, గ్రామ యువకుల సహకారంతో పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు సుమారు రూ.50 వేల విలువైన స్కూల్ యూనిఫాంలను అందజేశారు. అంతేకాకుండా పాఠశాలలో విద్యార్థులకు సేవలందిస్తున్న ఆయాలకు 6 చీరలను కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజ్ హాజరయ్యారు.





**ఈ సందర్భంగా లక్కం కృష్ణ మాట్లాడుతూ...**

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. గ్రామ యువత ముందుకు వచ్చి విద్యార్థులకు యూనిఫాంలు అందజేయడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వీణ, ఉప సర్పంచ్ గంగారం సంపత్, అడ్వకేట్ లక్కం కిషోర్, వార్డు సభ్యులు జెట్టి హన్మాండ్లు, మాధవి, లలిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపి (RMP)

## శ్రీనివాస్ గౌడ్ పై కేసు నమోదు: రమేష్ గౌడ్

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోఎలాంటి సర్టిఫికెట్ లేకుండా ఆర్ఎంపి శ్రీనివాస్, గ్రామం గొల్లపల్లి అనునతడు మందులు, సూదులు,రక్త పరీక్షలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తూ తన కమిషన్ కోసం తనకు తెలిసిన కమిషన్ ఇచ్చు ఆసుపత్రులకు తీసుకెళ్తూ మోసం చేస్తున్నాడు. గత నెల లో మల్లేష్ అరుణ,భర్త సంతోష్,వయసు 35 సంవత్సరాలు,కులం రెడ్డి, గ్రామం గొల్లపెల్లి అను ఆమెకు చాతిలో నొప్పి రావడంతో ఆమెకు =వీూ శ్రీనివాస్ మందులు, సూదులు ఇచ్చి తగ్గకపోయేసరికి సిరిసిల్ల హాస్పిటల్ కి అక్కడినుండి కరీంనగర్ లోని మురుగన్ హాస్పిటల్ కి తీసుకెళ్లగా ఆమె చికిత్స పొందుతూ చనిపోయినది. ఎలాంటి సర్టిఫికెట్ లేకుండా ఆర్ఎంపీ గా మందులు సూదులు రక్త పరీక్షలు చేస్తూ ప్రజలను మోసం చేస్తూ తన కూతురి ఆరోగ్య పరిస్థితి చెప్పకుండా తన కూతురు మరణానికి =వీూ శ్రీనివాస్ కారణమైనడని చాతని రామ్ రెడ్డి,తండ్రి నారాయణరెడ్డి, గ్రామం గొల్లపల్లి అతడు ఇచ్చిన దరఖాస్తుపై ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్ . రమేష్ గారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం అయినదని తెలిపినాడు.ప్రజలు ఎలాంటి వైద్య అర్హతలు, ధ్రువపత్రాలు లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దు.అర్హత లేని వ్యక్తుల వద్ద మందులు, ఇంజెక్షన్లు, రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.అనుమానాస్పదంగా వైద్యం చేస్తున్న వ్యక్తుల వివరాలను సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు లేదా పోలీసులకు తెలియజేయాలి.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులకు సహకరించాలి.ప్రజల ఆరోగ్య భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. అర్హత కలిగిన వైద్యులనే సంప్రదించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్సై రమేష్ సూచించారు.



# పీఏసీఎస్ చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్

**చిగురుమామిడి/ సెప్టెంబర్ 12/ప్రజా జ్యోతి,**

చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంనూతన చైర్మన్‌గా చిట్టుమల్ల రవీందర్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు.సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఆయనతో పాటు 12మంది నూతన డైరెక్టర్లతో సహకార శాఖ సహాయ రిజిస్ట్రార్ మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.చైర్మన్ రవీందర్‌తోపాటు ప్రమాణస్వీకారం చేసిన వారిలో డైరెక్టర్లు చాడ మహిపాల్ రెడ్డి,పోటు మల్లారెడ్డి,చిట్యాల బాల్ రేడ్డి,పచ్చిమట్ల లక్ష్మీ, కూతాటి తిరుపతి,శ్రీరామోజు రాజకుమార్,చింతపుల సాయన్న,కనగడ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, బెజ్జంకి భాగ్య, పిల్లి కొమురయ్య,బొమ్మగాని పరుశురాములు ఉన్నారు. నూతన పాలకవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్,స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్ కుమార్, సర్పంచులు చింతపుల నరేందర్,అల్లెపు సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు బదుకోలు దేవేందర్ రెడ్డి,సాంబారి బాబు,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణుగోపాల్,గుళ్ళ రాజు,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,పూదరి వేణు,ఎనగందుల లక్ష్మణ్,మాచమల్ల రమణయ్య, బోయిని నరేష్,గట్టు ప్రశాంత్,సోషల్ మీడియా మండల కన్వీనర్ జిల్లేల రమేష్,రైతులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

## ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి





వెల్గటూర్, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి సూచించారు. వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల గణేశ్ మండపాల నిర్వాహకులతో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐ రామ్ నర్సింహారెడ్డి, ఎస్సై పి.ఉదయ్‌కుమార్ హాజరై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.మండపాల వద్ద విద్యుత్ వైర్లు, స్విచ్‌బోర్డులు, ఇతర పరికరాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు, నిర్ణీత సమయాలను పాటించాలన్నారు. అసభ్యకరమైన పాటలు, నృత్యాలకు తావివ్వరాదని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.నిమజ్జనం సందర్భంగా వాహనాలపై పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. చెరువులు, కుంటల వద్ద ఈత రాని వారు నీటిలోకి దిగరాదని, పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో వెల్గటూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

# జగన్‌కు కన్నీటి వీడ్కోలు.. పాడె మోసిన కొప్పుల

## కంటతడి పెట్టించిన అంతిమయాత్ర..

## బీఆర్ఎస్ నేతకు మాజీ మంత్రి ఘన నివాళి







ఎండపల్లి, సెప్టెంబర్ 12,ప్రజా జ్యోతి

బీఆర్ఎస్ ఎండపల్లి మండల తాజా మాజీ అధ్యక్షుడు , మాజీ సర్పంచ్ సింహాచలం జగన్ అకాల మరణ వార్త మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను తీవ్రంగా కలచివేసింది. విషయం తెలిసిన వెంటనే గుల్లకోటకు చేరుకున్న ఆయన.. జగన్ పార్థివదేహాన్ని చూసి భావోద్వేగానికి గురయ్యారు. కన్నీటి పర్యంతమవుతూ పూలమాల వేసి నివాళులర్పించారు.జగన్ భౌతికకాయంపై బీఆర్ఎస్ పార్టీ జెండాను కప్పి పార్టీ తరఫున ఘన గౌరవం ప్రకటించారు. తనతో సన్నిహితంగా మెలిగిన నాయకుడిని కోల్పోయిన విషాదంలో కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా కలత చెందారు. చివరి వీడ్కోలు పలికే సమయంలో స్వయంగా జగన్ పాడెను మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని సైతం కంటతడి పెట్టించింది.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కోసం జగన్ చేసిన సేవలు, ఆయన అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనివని అన్నారు. జగన్ మృతి పార్టీకి తీరని లోటని, వ్యక్తిగతంగా తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో జగన్ కుటుంబసభ్యులు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు జీవన్ రెడ్డి, బిఆర్ ఎస్ నేతలు శ్రేణులు , ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు,

# అభివృద్ధి పనులకు శ్రీకారం..

కొడిమ్యాల,సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ కొడిమ్యాల గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో, వీబీజీరాంజీ నిధులతో 13వ వార్డులో రూ.8 లక్షలతో సైడ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి, 11వ వార్డులో రూ.3 లక్షలతో సైడ్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రం నర్సయ్య, వార్డు సభ్యులు రాపర్తి నర్సింగరావు, బోగ గౌతమి రవి, నార్ల శ్రీజ సాయి, మహేందర్, నాయకులు వినోద్‌రెడ్డి, నాగార్జున, యాది తదితరులు పాల్గొన్నారు.





# జగన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన మద్దుల గోపాల్‌రెడ్డి

ఎండపల్లి, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి

ఎండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింహాచలం జగన్ మృతి పట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురై జగన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గోపాల్‌రెడ్డి శనివారం జరిగిన అంత్యక్రియలకు హాజరై జగన్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. , జగన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పలు గ్రామాల సర్పంచులు, యువనాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.



# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య ?

**ఎండపల్లి, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి**



అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన ఎండపల్లి మండలం గుల్లకోట లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన, సింహాచలం జగన్ (48) ఇంటి, వ్యక్తిగత అవసరాల కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో స్లాబ్ పిల్లర్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై పి.ఉదయ్‌కుమార్ తెలిపారు.



## మరణంలోనూ మానవత్వం, - ఇద్దరికి చూపునివ్వనున్న సింహాచలం జగన్ నేత్రాలు,

**ఎండపల్లి, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి,**

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన ఎండపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు గుల్లకోట గ్రామ మాజీ సర్పంచ్ సింహాచలం జగన్ మరణంలోనూ మానవత్వాన్ని చాటుకున్నారు. తాను మరణించినా.తన నేత్రాలతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత్రదానం చేశారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో జగన్ నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఫోరెన్సిక్ వైద్యుడు శ్రీనివాస్, టెక్నీషియన్ బాలరాజు ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి ఆసుపత్రికి తరలించారు. జీవించి ఉన్న సమయంలో పలువురికి ఉపయోగపడిన జగన్.. మరణానంతరం కూడా తన నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపునివ్వనున్నారు. దీంతో జీవించి ఉన్నప్పుడే కాకుండా మరణించిన తర్వాత కూడా ఇతరులకు ఉపయోగపడే వ్యక్తిగా సింహాచలం జగన్ నిలిచారని పలువురు పేర్కొన్నారు.



# గణేష్ మండపాల సమావేశానికి పిలిచి.. ట్రబుల్ మాంగర్స్ ముద్ర ఎందుకు?

**- ఒక యూత్‌లో గతంలో కేసులున్న వ్యక్తి ఉంటే.. అందులోని మంచి యువతకూ అదే ముద్ర వేయడం సమంజసమేనా?**

**- సమావేశానికి పిలిచి సమస్యాత్మక వర్గంగా ప్రస్తావించడంపై ప్రజాసంఘాల మండిపాటు**

**కోరుట్ల, సెప్టెంబర్ 12 ప్రజాజ్యోతి**



కోరుట్ల పట్టణంలో గణేష్ ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం శుక్రవారం నిర్వహించిన గణేష్ మండపాల సమావేశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గణేష్ మండపాల నిర్వాహకులు, యువతను సమావేశానికి పిలిచి.. అనంతరం సంబంధిత ప్రెస్‌నోట్‌లో 'రౌడీ షీటర్లు', 'ట్రబుల్ మాంగర్స్' వంటి పదాలను ప్రస్తావించడం పట్ల ప్రజాసంఘాలు, యువత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**- ఒకరిపై కేసు ఉంటే.. అందరికీ అదే ముద్రా?**

ఒక యూత్ గ్రూపులో గతంలో ఉన్న ఒక వ్యక్తిపై కేసు ఉండవచ్చు. అయితే అదే గ్రూపులో ఎలాంటి కేసులు లేని, సమాజంలో మంచి పేరున్న యువత కూడా ఉండవచ్చు. అలాంటి వారిని కూడా సమావేశానికి పిలిచి, మొత్తం గ్రూపును 'ట్రబుల్ మాంగర్స్'గా ప్రస్తావించడం ఎంతవరకు సమంజసం? అని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.ఒక వ్యక్తి గత చరిత్ర ఆధారంగా.. అదే యూత్‌లో ఉన్న ప్రతి ఒక్కరినీ అనుమానితులుగా చూడటం సరైన విధానం కాదని వారు మండిపడుతున్నారు. వ్యక్తిగతంగా ఎవరిపై ఏమైనా ఆరోపణలు లేదా కేసులు ఉంటే.. సంబంధిత వ్యక్తులకే పరిమితం చేసి చర్యలు తీసుకోవాలి తప్ప, అందరినీ ఒకే కోవలో చూపడం తగదని పేర్కొంటున్నారు.

**- సమావేశానికి పిలిచి.. ఇలాంటి ముద్ర వేయడమేంటి?**

గణేష్ మండపాల సమావేశం ఉద్దేశం యువతతో సమన్వయం చేసుకోవడం, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడం, శాంతిభద్రతలపై అవగాహన కల్పించడం. కానీ సమావేశానికి పిలిచిన యువతను ప్రెస్‌నోట్‌లో 'ట్రబుల్ మాంగర్స్'గా ప్రస్తావించడం ద్వారా వారికి ఎలాంటి సందేశం ఇస్తున్నారు? అని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి.పోలీసులతో కలిసి ఉత్సవాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన యువతను ప్రోత్సహించాల్సిన సమయంలో.. వారిపై అనుమానపు ముద్ర వేయడం వల్ల పోలీసులపై నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని వారు అంటున్నారు.

**- కౌన్సెలింగ్ పేరుతో సామాజిక ముద్ర సరికాదు**

గతంలో కేసులు ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇవ్వడం పోలీసుల విధుల్లో భాగమే. అయితే కౌన్సెలింగ్‌కు పిలిచిన వారందరినీ ఒకే రకంగా చూపించడం, మంచి ప్రవర్తనతో ఉన్న యువతను కూడా సమస్యాత్మక వర్గంగా ప్రస్తావించడం సరికాదని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి.ఒక యూత్‌లో ఒక్కరిపై కేసు ఉంటే.. మిగతా మంచి యువతను కూడా అదే ముద్రలోకి లాగడం న్యాయమా? అని వారు నిలదీస్తున్నారు.

**- పోలీసుల పదప్రయోగంపై స్పష్టత ఇవ్వాలి**

కోరుట్ల ఎస్సై పంపినట్లు చెబుతున్న ప్రెస్‌నోట్‌లో 'రౌడీ షీటర్లు', 'ట్రబుల్ మాంగర్స్' అనే పదాలను ఏ ఉద్దేశంతో ఉపయోగించారో స్పష్టం చేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. ఆ పదాలు ఎవరిని ఉద్దేశించి వాడారు? సమావేశానికి హాజరైన వారిలో ఎవరిని ఆ వర్గంలో పరిగణించారు? అనే అంశాలపై వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**- శాంతి సమావేశం లక్ష్యం.. యువతపై ముద్ర కాదు**

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలంటే పోలీసులకు, యువతకు, మండపాల నిర్వాహకులకు మధ్య నమ్మకం, సమన్వయం అవసరం. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం ఒక అంశమైతే.. ఎలాంటి తప్పు చేయని యువతపై అనవసరమైన ముద్ర పడకుండా చూడటం కూడా పోలీసుల బాధ్యతేనని ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి.గణేష్ మండపాల సమావేశానికి పిలిచిన యువతను 'ట్రబుల్ మాంగర్స్'గా ప్రస్తావించడం , ఒకరి గతం ఆధారంగా అందరినీ ఒకే కోవలో చూడటం మానుకోవాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పోషణ మాసాల ఉత్సవాలు

**రాయికల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**





పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం రోజున రాయికల్ పట్టణంలోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పోషక ఆహారాల గురించి, చిన్న పిల్లలు తీసుకోవలసిన సమతుల్య ఆహారం మరియు దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తోపారపు ప్రశాంతి, అంగన్వాడి టీచర్ బొంగోని సింధూరి, సుమలత, పుష్పలత, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.